# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 11 మే 2025 | HYDERABAD


## ఇవేం సన్న బియ్యం.. అన్నీ నూకలే..



'ఇవేం బియ్యం.. అన్నీ నూకలే.. ముక్కిన బియ్యంతో దుర్వాసన వస్తున్నది'..అంటూ.. కాంగ్రెస్ సర్కారు అందిస్తున్న సన్నబియ్యంపై లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చినా.. రుచిగా ఉండేదని, ఈ బియ్యం రుచిగా కూడా లేవని మండిపడుతున్నారు. రాజేంద్రనగర్ సులేమాన్‌నగర్ డివిజన్‌లోని ఓ రేషన్ షాప్ డీలర్ వద్ద లబ్ధిదారులు సన్నబియ్యాన్ని చూయించి.. ఇలా తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

- వ్యవసాయ యూనివర్సిటీ, (హైదరాబాద్) మే 10 :



**మేము సైతం..** శనివారం నానక్‌రామ్‌గూడలోని సుమధుర ఆక్రోపోలీస్ విల్లా వాసులు జవాన్లకు మద్దతుగా తీసిన సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు



## సిబిల్ బాగుంటేనే రుణాలా!



రాజీవ్ యువ వికాసం పథకానికి సర్కార్ కొర్రీలు

నిరుద్యోగుల్లో ఆందోళన

IVలో




## స్లీపర్ సెల్స్‌పై ప్రత్యేక నజర్

నగర అంతర్గత భద్రతపై డేగ కన్ను

పాతనేరస్తుల కదలికలపై నిఘా

ఉగ్ర సంబంధాలు, సానుభూతిపరుల గుర్తింపునకు షాడో బృందాలు

IIలో




### విచ్చలవిడిగా మందులు వాడి రోగాల పాలు

- రోగం ముదిరాక ఆసుపత్రికి నడివయస్సు వారే అధికంగా బాధితులు
- ఏఐ సూచనలు మాత్రమే ఇస్తుంది..
- ట్రీట్‌మెంట్ చేయదదంటున్న వైద్యులు
- ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దంటూ సూచన

ఇప్పుడు ఏ సూచన కావాలన్నా.. ఏ విషయం తెలుసుకోవాలన్నా.. ఏఐనే ఫాలో అవుతున్నారు జనం..అయితే ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆరోగ్యం విషయంలో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్‌ను నమ్ముకోవడం ఇప్పుడు ఆందోళన కలిగించే అంశం. కొందరు చాట్‌జీపీటీలో ఏ రోగానికి ఏ మాత్రలు వాడలో వెతుకుతూ.. అధిక డోసులు కలిగిన మందులు వాడేసి.. కొత్తరోగాలను కొనితెచ్చుకుంటున్నారు. చివరికి రోగం ముదిరి ప్రాణాల మీదకి రాగానే ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. సొంత వైద్యం ప్రమాదకరమో..'ఏఐ వైద్యం' మరింత ఇబ్బందులను కొనితెచ్చిపెడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

-సిటీబ్యూరో, మే 10, (నమస్తే తెలంగాణ)

# ఆరోగ్యానికి ప్రమాదం ఏఐ వైద్యం



### ఏ రోగానికైనా చాట్‌జీపీటీనే ఆధారమా?

**హైదరాబాద్‌కు** చెందిన 35 ఏండ్ల కుమార్ ఒళ్లు నొప్పులతో బాధపడుతూ నొప్పులు తగ్గేందుకు మాత్రల కోసం గూగుల్‌ను ఆశ్రయించాడు. వాటిని వేసుకున్న తరువాత కూడా నొప్పులు తగ్గకపోగా జ్వరం వచ్చింది. తీవ్ర జ్వరం, నొప్పులతో వారం రోజుల తరువాత ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి సరైన చికిత్సనందిస్తే కాస్త కోలుకున్నాడు.

**రంగారెడ్డికి** చెందిన ఓ గృహిణి ఇంట్లో పనులు చేస్తూ కాలు జారి పడటంతో యూట్యూబ్‌లో చూసి సెల్ఫ్ మెడికేషన్ వాడటం మొదలు పెట్టింది. నాలుగు రోజుల తరువాత కూడా నొప్పి తగ్గకుండా కాలు వాపు రావడంతో భయపడి వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. నెలరోజుల పాటు చికిత్సనందించి ఆమె ఆరోగ్యం కుదుటపడేలా చేశారు. దాంతో పాటు బిల్లు కూడా అధిక మొత్తంలో వేశారు. గాయమైన మొదట్లోనే వైద్యున్ని సంప్రదించి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు.

**సాంకేతిక** విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత సమాజంలో ప్రజలు ప్రతి పనికి ఇంటర్‌నెట్ మీద ఆధారపడుతున్నారు. ఆఖరికి ఆరోగ్యం విషయంలో కూడా సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్(ఏఐ) తాలుకా చాట్‌జీపీటీలో ఏ రోగానికి ఏ మాత్రలు వాడాలో వెతుకుతున్నారు. అధిక డోసులు కలిగిన మందులు వాడుతూ రోగాలపాలవుతున్నారు. ఉదాహరణకు అలెర్జీ ఉన్న వారికి గూగుల్ చెప్పిన మందులు వాడటం వల్ల శరీరంలో తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఏర్పడి రోగం ముదురుతుంది. సెల్ఫ్ మెడికేషన్ కేసులకు గ్రేటర్ హైదరాబాద్ నిలయంగా మారింది. ఈ తరహా వాడకం వల్ల రోగాలు ముదిరి చివరి దశలో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌లల్లో నిత్యం ఉండే ఓపీ సేవల్లో సగానికి పైగా కేసులు ఇలాంటి తరహాలోనే ఉంటున్నాయి. ఇందులో ప్రధానంగా నడివయస్సు వారే అధికంగా ఉండటం గమనార్హం.



చిన్నరోగానికే వైద్యుని వద్దకు వెళితే డబ్బులు ఖర్చు అవుతాయని చాలా మంది భావన. అందుకే ఆసుపత్రికి వెళ్లకుండా ఇంటర్‌నెట్, మెడికల్ దుకాణాలు, ఇరుగు పొరుగు వారి సలహాలతో కావాల్సిన మందులు కొని వాడుతున్నారు. జ్వరం రావడంతోనే ఆలస్యం చేయకుండా మాత్రలు వేసుకుని, తాత్కాలికంగా ఉపశమనం పొందుతున్నారు. నాలుగు రోజుల వరకు అది తగ్గకుండా పరిస్థితి విషమిస్తే గాని ఆసుపత్రిలో చేరడంలేదు. సీజనల్ వ్యాధుల విషయంలోనూ ఇదే తంతు. జలుబు, దగ్గు సమయాల్లో వైద్యున్ని సంప్రదించకుండానే సొంత వైద్యం చేసుకుంటున్నారు. మలేరియా, డెంగీ లక్షణాలు ఉన్నా.. తేలిగ్గా తీసుకోవడం, రోగం ముదిరిన తరువాత ఆసుపత్రిలో చేరడం అలవాటుగా మారింది. వైద్య పరీక్షల్లో రోగం తీవ్రత తెలిసి బెంబేలెత్తిపోతున్నారు. మొదటి రోజు ఆసుపత్రికి వెళ్లకుండా వారం తరువాత వెళ్లడం కారణంగా వైద్యం అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు మరణించిన దాఖలాలు కూడా ఉన్నాయి. గూగుల్, చాట్ జీపీటీల వాడకం వల్ల నిండు ప్రాణాలు పోయే ప్రమాదం పొంచి ఉంది.

#### వైద్యులను సంప్రదించండి



**-డాక్టర్ శశిధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నిమ్స్ ఆసుపత్రి**

ఏఐ డయాగ్నోసిస్‌లో ఉపయోగకరంగా ఉంటుంది. అంతేతప్ప అదే వైద్యం చేయదు. కేవలం వైద్యుల సూచనల ప్రకారం మాత్రమే పని చేసే సాధనం. శస్త్ర చికిత్సలు కూడా వైద్యుడే చేయాలి. బద్ధకం, ఆసుపత్రికి వెళితే డబ్బులు ఖర్చవుతాయనే కారణంగా చాలా మంది ఆన్‌లైన్ వైద్యం చేసుకుంటున్నారు. రోగం మొదట్లోనే వైద్యున్ని సంప్రదించకపోవడం వల్ల చివరికి రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తున్నది.



# అందాల సందడి

**గచ్చిబౌలి** స్టేడియంలో శనివారం 72వ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యాయి. 110 దేశాలకు చెందిన ముద్దుగుమ్మలు పాల్గొని.. తమ దేశ ఆహార్యం.. సంస్కృతీ, సంప్రదాయాలతో సందడి చేశారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఏషియా దేశాల సుందరీమణులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన, డప్పు, ఒగ్గు డోలు విన్యాసాలు అలరించాయి. మిస్ ఇండియా నందిని గుప్తా కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

-సిటీబ్యూరో, మే 10(నమస్తేతెలంగాణ)

## ఏపీకే ఫైల్స్‌తో సైబర్ దాడికి చాన్స్

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): వాట్సాప్, ఈ-మెయిల్‌లతో పాటు ఇతర సోషల్ మీడియా వేదికల్లో షేర్ చేసిన ఏపీకే ఫైల్స్, exe ఫైల్‌లతో సైబర్ దాడి జరిగే అవకాశమున్నదని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ దారా కవిత తెలిపారు. ఫిషింగ్ ఈ మెయిల్స్, నకిలీ లాగిన్ పేజీలు, డేంజర్ అటాచ్‌మెంట్స్ వంటి అధునాతన వ్యూహాలతో సైబర్ దాడులు జరుగుతాయని తమకు సమాచారమున్నట్లు చెప్పారు. ముఖ్యంగా 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' అనే వైరస్ అత్యంత ప్రమాదకరమైందని, ఈ మాల్‌వేర్ ఓపెన్ అయిన తర్వాత ఒకసారి ఇన్‌స్టాల్ అయితే వ్యక్తిగత, బ్యాంక్ సమాచారంతో సహా రహస్య సమాచారమంతా పూర్తిగా సైబర్ మోసగాళ్ల చేతిలోకి పోతుందని హెచ్చరించారు.



ఈఎస్ఐ ఆసుపత్రి

## కార్మిక బీమా.. ఏదీ ధీమా!

వైద్యులు లేక.. ఉన్నవాళ్లు సమయానికి రాక కార్మికుల ఇబ్బందులు

సరిపడా మందులు లేకపోవడంతో ప్రైవేట్ ఫార్మసీలకు వెళ్తున్న వైనం

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు వైద్య సేవలందించాల్సిన ఈఎస్ఐ వైద్యంలో నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. వైద్యం చేయించుకునేందుకు వచ్చినవారికి ఒక వైపు వైద్యులు లేకపోవడం మరోవైపు కావాల్సిన మందులు దొరక్కపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పేరుకు మాత్రమే కార్మిక బీమా ఉన్నదని, కార్మికులకు వైద్యంలో ధీమా ఎక్కడున్నదని వాపోతున్నారు.

#### తూతూ మంత్రంగా సేవలు..

గ్రేటర్ పరిధిలో సుమారు 10 లక్షల మంది ఈఎస్ఐ కార్డులు కలిగి ఉన్నారు. ఖైరతాబాద్, బాలానగర్, సనత్‌నగర్. చప్పల్‌బజార్, చిక్కడపల్లి, చిలకలగూడ, డబీర్‌పురా, ఫతేనగర్, గోల్కొండ, గోషామహల్, హిమ్మత్‌పురా, కవాడిగూడ, విద్యానగర్, రామంతాపూర్, రాణిగంజ్, సికింద్రాబాద్, తార్నాక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీలకు నిత్యం ఒక్కో సెంటర్‌కు రోజుకు 150 మంది వివిధ అనారోగ్య సమస్యలతో ఔట్ పేషెంట్లు వస్తుండటం గమనార్హం. 3వేల మందికి పైగా ఈఎస్ఐ కార్డుదారులకు ఒక్కోటి చొప్పున ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటు చేశారు. అయితే జిల్లాలోని పలు డిస్పెన్సరీల్లో మెడికల్ అధికారులు లేరు. దీంతో రోగులు వైద్యం కోసం ఇతర డిస్పెన్సరీలకు వెళ్లే పరిస్థితి నెలకొంటున్నది. కొన్ని చోట్ల తూతూ మంత్రంగా ఓపీ నిర్వహిస్తూ, మధ్యాహ్నం తరువాత సెంటర్లలో ఉండకపోవడంతో ఏఎన్ఎంలే చికిత్సనందిస్తున్న పరిస్థితి ఉంది.

#### ప్రైవేట్ ఫార్మసీలను ఆశ్రయిస్తూ..

దీర్ఘకాలిక వ్యాధులలో బాధపడుతూ డిస్పెన్సరీలకు వచ్చేవారికి నిరాశే మిగులుతున్నది. కావాల్సిన మందులు అందుబాటులో లేకపోవడంతో చేసేదిలేక ప్రైవేట్ ఫార్మసీల్లో కావాల్సిన మందులు కొనుక్కుంటున్నారు. ప్రతిసారీ పూర్తిస్థాయిలో కావాల్సిన మందులు ఇవ్వడం లేదని, వచ్చే జీతంలో మందులకే ఖర్చు చేయాల్సి వస్తున్నదని కార్మికులు వాపోతున్నారు. మరోవైపు పలువురు డబ్బులు పెట్టే స్థోమత లేక, ఫార్మసిస్టులు చెప్పినట్లు అనేకసార్లు సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, పనులకు ఆలస్యంగా వెళ్తూ యజమానితో తిట్లు తింటున్నారు. పేద కార్మికులకు వరంగా మారిన ఈఎస్ఐ వైద్యాన్ని గాడిలో పెట్టాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.




**అమరవీరుల త్యాగాలు వెలకట్టలేం** దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను వెలకట్టలేమని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. భారత ఆర్మీకి సంఘీభావంగా శనివారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి బడంగ్‌పేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడంగ్‌పేట నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు జాతీయ పతాకాలతో ఆర్మీకి సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామిడి రాంరెడ్డి, కామేశ్‌రెడ్డి, అరవింద్‌శర్మ, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామనరసింహాగౌడ్ పాల్గొన్నారు. -బడంగ్‌పేట

# ఎల్‌ఆర్‌ఎస్.. ఒట్టి చేతులే..

- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలో కానరాని స్పందన
- బెడిసికొట్టిన సర్కారు కొత్త విధానం
- ప్రొసీడింగులు రాకపోవడమే ఖజానాను ముంచింది
- 'రియల్' కూడా మరో ప్రధాన కారణం

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంలో ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానం, రియల్ ఎస్టేట్ మార్కెట్ నేలచూపు.. ఖజానా ఆశలను గల్లంతు చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ పరిధిలో కలిపి దాదాపు రూ. 7వేల కోట్ల రెవెన్యూ ఆశించిన ప్రభుత్వానికి దరఖాస్తుదారుల నుంచి చుక్కెదురైంది. గత ప్రభుత్వానికి భిన్నంగా దరఖాస్తుల పరిశీలన చేయకుండానే ఫీజులు చెల్లించాలని చెప్పడం, అందులోనూ ఫీజులు చెల్లించిన ప్రొసీడింగుల జారీలో జాప్యం..వంటివి ఎల్‌ఆర్‌ఎస్‌కు ఆదరణ లేకుండాపోయిందన్న చర్చ అధికార వర్గాల్లో నెలకొంది.



#### దరఖాస్తులను పరిశీలించకుండానే..

జీపీ లే అవుట్లు, అనధికారిక వెంచర్లలో ఓపెన్ ప్లాట్లను క్రమబద్ధీకరిస్తామని, ఇందుకు ముందుగానే ఫీజులు చెల్లించాలని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే గనుక, చెల్లించిన ఫీజులో 10 శాతం కోత విధించి మిగిలిన 90 శాతాన్ని దరఖాస్తుదారులకు తిరిగి చెల్లిస్తామని ప్రకటించింది. ఇదే ఎల్‌ఆర్‌ఎస్‌పై వచ్చే ఆదాయానికి గండికొట్టిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మొత్తం దరఖాసుల్లో ఫీజు నోటీసులు చెల్లించాలని ఆదేశించినా... అర్జీలు పరిశీలించకుండానే ఫీజులు ఎలా చెల్లించేదని.. చాలా మంది వెనకడుగు వేశారు. మూడు దశల్లో జరిగే క్రమబద్ధీకరణ ప్రక్రియలో తొలుత టైటిల్ వెరిఫికేషన్, రెండో దశలో ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల పరిశీలన తర్వాత దరఖాస్తులకు మూడో దశలో ప్రొసీడింగులు జారీ చేస్తోంది. కానీ ప్రభుత్వం మాత్రం ఇవేవి చేయకుండానే ఫీజులు వసూలు చేసే ప్రయత్నం చేసింది. అదేవిధంగా ఒకవేళ ఫీజులు చెల్లించిన నిర్ణీత గడువులోగా ప్రొసీడింగ్‌లు జారీ చేస్తామని స్పష్టంగా చెప్పకపోవడమే ఎల్‌ఆర్‌ఎస్ స్పందన కరువయ్యేలా చేసింది.

#### రియల్ ధమాల్ మరో కారణం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులు కూడా ఎల్‌ఆర్‌ఎస్ రెవెన్యూపై పెట్టుకున్న ఆశలకు చెక్ పెట్టాయి. ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం తీసుకున్న ఎన్నో వివాదాస్పద నిర్ణయాలు మార్కెట్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాయనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. హైడ్రా కూల్చివేతలు, మౌలిక వసతుల ప్రాజెక్టుల ప్రణాళికల్లో తెచ్చిన మార్పులు కూడా దరఖాస్తుదారులను ఎల్‌ఆర్‌ఎస్ ఆకట్టుకోలేకపోయింది.